# దొంగ ప్రేమ

లచ్చి అంటే బిచ్చాలుకి చచ్చేంత ప్రేమ.

లచ్చి ఒకమ్మాయి పేరు. లచ్చి డబ్బుకి మరొక మాట.

బిచ్చాలుకి అర్థాలు తెలుసు.

అతను పిచ్చివాడు కాదు. ప్రేమించినవాడు.

ప్రేమంటే ప్రేమకాదు. నిజమయిన నిఖార్సు అయిన ప్రేమ.

అతనికి లచ్చి లేదు. లచ్చికి అతనున్నాడు. అతను లచ్చి కోసం పుట్టలేదు. లచ్చి అతని కోసం పుట్టింది.

దమ్మిడీ పనిచేయడు. వందలు సంపాయిస్తాడు.

వేల శ్రమ పడతాడు. దమ్మిడీఅంత ప్రేమ లచ్చినుంచి పొందలేడు.

బిచ్చాలు దొంగ కాదు. జేబులు కొడుతూ వుంటాడు. బిచ్చాలు పచ్చి దొంగ. లచ్చి హృదయం దోచుకోలేక పోయాడు.

'నాకు వేరే చాల పనులున్నాయి, వెళతాను' డబ్బు అన్నప్పుడు ముద్దు పెట్టుకొని మెడలో పూలమాల వేసి కారులో తీసుకుపోయి విడిచిపెట్టి వస్తాడు.

అప్పుడు జనం 'మంచివాడూ, భోళా మనిషీ' అంటారు. సారాయి దుకాణం సంగయ్యకీ, భోగం పిల్ల భాగ్యానికీ, బీడీ కొట్టు పైడయ్యకీ అతని మంచితనం కొల్లగా తెలుసు.

'నేనొస్తాను' అని డబ్బు అంటే 'ఊఁ! రా!' అంటూ కౌగ
లించుకొని చీరె సింగారించి కాలనడక ఎక్కడికో తీసుకు
వెళతాడు. జనం ఆ సమయాల్లో అతన్ని 'దొంగ' అంటారు.

పార్కులో నిద్రపోయిన మనిషికీ, బ్యాంకిలో డబ్బు మార్చు
కున్న వ్యక్తికీ, క్రిక్కిరిసిన రైలులో నెట్టుకుపోయే స్త్రీ మెడకీ,
సినిమా హాలు దగ్గర కుస్తీపట్టే వస్తాదుకీ, షోకోసం టర్లిన్ షర్టు
జేబులో పైకి కనిపించేటట్టు డబ్బు పెట్టే యువకుడికీ, వానిటీ
కోసం వానిటీ బేగ్ వానిటీగా ఊపుతూపోయే వయ్యారాల
వయ్యారికీ బిచ్చాలు దొంగతనం బాగా పరిచయం.

అతని ముఖం చూస్తే గుండె పగులుతుంది.

జాగ్రత్త కల్గిన జనానికి ఇది తెలుసు.

హృదయంతో హృదయం పరికిస్తే హృదయం అతుక్కుం
టుంది.

లచ్చికి అనుభవం ఆ సంగతి.

లచ్చి ఎవరోకాదు. రాములు కూతురు.

రాములు లైసెన్సు కూలీ. బిచ్చాలు దోస్తు!

లచ్చిమీద బిచ్చాలుకి పిచ్చి.

పిచ్చి ఈజ్ ఈక్వల్‌టూ ప్రేమ.

లచ్చి వెన్నెల కుప్ప!

బొగ్గులు ఏరి అమ్మటం ఆమె వృత్తి.

బొగ్గుల బుట్ట నెత్తిన పెట్టుకొని నడుస్తూంటే బిచ్చాలు
నిప్పులమీద పడి దొర్లినంత ఆనందం పొందుతాడు.

ఆమె పెదాల వంకరతనం అతని గుండెలు తీసుకొని మ్రింగి పూరుకుంటున్నాయి.

చంద్ర బింబాన్ని మెడపట్టి లాక్కొచ్చి తలక్రింద వేసుకొని హాయిగా నిద్రపోవాలన్న కోర్కె ఆమె ముఖం చూస్తే కలుగుతుంది.

లచ్చి ముక్కు ముల్లు, కళ్లు దొంగవి.

ఆమె ఆవులిస్తే అతని నరాలన్నీ సంగీతం మొదలు పెడతాయి.

ఆమె తల గోక్కుంటూవుంటే అవయవాలు అన్నీ తందాన తానా అంటూంటాయి.

అతను ఎంతో కాలం ఓపిక పట్టలేకపోయాడు.

రాములుదగ్గరకు పోయి ఒక రోజు—

'మావా'

'ఏం దోస్త్'

'మర్—నేనే—లచ్చినే—మరే—పెళ్లి.'

'అది పోరే'

'అరి కాదు'

'అదిలేదు గిదిలేదు అది నిన్ను చేసుకోదు.'

బిచ్చాలు అంతటితో ఆశలు వదులుకోలేదు.

కల్లు తాగించాడు.

రాములు అంగీకరించలేదు.

సినిమాకి తీసుకపోయాడు.

ఒప్పుకోలేదు.

పలావ్ తినిపించాడు.

తల వూపలేదు.

చొక్కాలు కొని పెట్టాడు.

సమ్మతించలేదు.

చివరికి బావురుమని ఏడ్చాడు.

రాములు గుండెలు కరిగి కాలవలై ప్రవహించాయి.

అందులో తడిసి తలమునకలయ్యాడు బిచ్చాలు. అప్పు డతనికి అనునయవాక్కులు వినిపించాయి.

'ఎర్రి నాగమ్మా ఏడవబాకహే. అదొప్పుకుంటే నిమెశాల మీద పెళ్లవుద్ది.'

'అయితే ఒప్పిత్తా' అంటూనే వెళ్లిపోయాడు.

ఇంటికి పోయాడు. పిలిచాడు. చూడలేదు.

పెడ్డు దగ్గరకు వెళ్లాడు. నవ్వాడు చూచింది.

రోడ్డుమీద చూశాడు. పలుకరించాడు నవ్వింది.

రాములుండగా మాట్లాడించాడు. నవ్వుతూ మాట్లాడింది.

ఒక రోజు, లచ్చి తల స్నానం చేసి, వెంట్రుక లన్నీ మంచంమీద వేసి ఆరబెట్టుకుంటూ అనుకోకుండా ఆ శిరోజాల పరుపుమీద ఆవులిస్తూ పడుకొని నిద్రపోయింది.

బిచ్చాలు చూశాడు. హృదయంబో బిచ్చాలు రెచ్చి పోయాడు.

ముటిక్కిన ముద్దు పెట్టుకున్నాడు.

త్రుళ్లిపడి లేచింది.

'ఏందది!'

కోపంగా చూచింది.

'ప్రేమ!'

చేతులు అనవసరంగా త్రిప్పుతూ చెప్పాడు.

చేతులు తిరిగే వాటం చూసి ఫుసిక్కిన నవ్వేసింది.

అతను ఆనందంగా వీపు తట్టుకున్నాడు.

పెళ్లి చేసుకుంటానని చెప్పాడు.

ఒప్పుకుంది.

అయితే రెండు అవాంతరాలు!

భాగ్యంతో మాట్లాడకూడదు.

దొంగతనం చేయకూడదు!

'అస్ అంతేకదా! ఆల్ రైట్' అనుకున్నాడు.

అతను ఇస్త్రీ పేంటు వేసుకొని దొరబాబులాగా నడుస్తుంటే ఆమె గుండెల్లో ఆనందంగా జ్వరం తగులుతుంది.

ఇంగ్లీషు మాటలు ఒకటీ రెండు పలికితే ఓ యబ్బో అని నోటిమీద వేలేసుకుని, తీసికోవటం మర్చిపోయి తేలిగ్గా నవ్వి పారేస్తుంది.

నాలుగురోజులు గడిచాయి.

బిచ్చాలు దగ్గర డబ్బులు అయిపోయాయి.

కల్లు తాగాలి! డబ్బులు లేవు.

టీ తీసుకోవాలి! డబ్బులు లేవు.

బీడీ కాల్చాలి డబ్బులు లేవు.

ఎవరికీ తెలియకుండా ఎవరిదో జేబు కొట్టాడు, డబ్బులు ఉన్నాయి.

కల్లు తాగాడు, టీ తీసుకున్నాడు, బీడీ కాల్చాడు.

క్రొత్త ప్యాంట్ కొనుకున్నాడు, లచ్చి దగ్గరకు హుషారుగా పోయాడు.

తప్పు చేశానే, మాట తప్పానే అనే దిగులు గుండెలు పీకుతూవుంది.

'ఏడది పేంట్' ఆమె అడిగేసింది.

చెప్పలేకపోయాడు.

'డబ్బులేడ సంపాయించా'

చెప్పలేదు.

'చెప్పు'

మాటాడలేదు.

'చెప్పవా?'

పలకలేదు.

'దొంగతనం చేశావ్'

తలవ్వూపలేదు.

'చెప్పకపోతే మాట్లాడను'

చూడలేదు.

'ఈడ్నుంచి పో!'

పోబోయాడు.

'పోతావా!'

తల ఎత్తలేదు.

'ఏంది?'

సమాధానం పలకలేదు.

గుండెలమీద గుద్దింది. వలవలా ఏడ్చింది. 'పో! పో కనిపించబాక ఎల్లు' అంది.

వెలుపలికి వచ్చాడు.

భాగ్యం గుర్తుకు వచ్చింది. జేబునిండా డబ్బు వుంది.

వెళ్లాడు. ఆతిథ్యం అమోఘంగా దొరికింది.

లచ్చికి ఈ సంగతి తెలిసిపోయింది.

నాలుగు రోజులు అన్నం తినలేదు. నిద్ర పోలేదు.

బిచ్చాలు నేరం కారణంగా లచ్చిని చూడలేకపోయాడు.

ఆమె అతన్ని కలుసుకోవటానికి అవకాశం చిక్కలేదు.

మూడు నెలలు గడిచాయి.

గూడ్సు షెడ్డులో క్లర్కు ఒకతనున్నాడు. ఆమెని చూచి ఆవులించి, ఆ దెబ్బతో పెళ్లి చేసుకుంటానని పట్టుబట్టాడు.

రాములు తలవూపాడు.

లచ్చి ఆలోచించింది.

'ఆడు లాభంలేదు. మాటమీద నిలబడ్డు' అనుకుంది.

క్లర్కుని పెళ్లి చేసుకోటానికి అంగీకరించింది.

పెళ్లి ఏర్పాట్లు జరిగాయి.

పెళ్లికొడుక్కి రెండువందలు కట్నం కావాలి. లేకపోతే వాళ్ల నాన్న పెళ్లి ఆపించేస్తాడు.

రాములుకు ఆస్తి ఏమీలేదు. రెక్కలే అండ!

ప్లాటుఫారంమీద బిచ్చాలు కనిపించాడు రాములుకి.

పెళ్లి మాట చెప్పాడు.

శరీరం జలదరించింది, నెమ్మది చెందాడు, సంబాళించు
కొన్నాడు.

కళ్లల్లో నీళ్లు కనిపించలేదు.

'అదే మంచిది. దానికి నేను పనికిరాను' అనుకొన్నాడు
మనస్సులో.

అనేశాడు పైకి.

రాములు అడిగాడు.

'డబ్బు గావాలి'

'ఎందుకు?'

'కట్నం ఇవ్వాలి'

'ఎంత?'

'రెండొందలు'

'ఎప్పటికి కావాలి'

'రేపు రాత్రి పదికిలోగా'

'సరే'

'సరేగాదు. ఈకపోతే పెళ్లాగిపోద్ది'

'ఆగితే'

'దానికి పెళ్లిగాదు'

'నేనున్నాగా' విడిపోయాడు.

* * * *

అర్థ రాత్రి!

బిచ్చాలు రోడ్డుమీదకు వచ్చాడు.

అతనికి ఒకే పద్ధతి తెలుసు.

అది జేబులు కొట్టటం. ఇళ్లకు కన్నాలువేయటం తెలీదు.

పార్కులో పడుకున్నాడు. కలత నిద్ర.

లచ్చి పెళ్లి ఆగిపోయినట్లు కల!

మెలకువ వచ్చింది.

పెళ్లి ఆగితే బావుండును అనుకొన్నాడు. అయ్యో అలా కాదు. పెళ్లి జరగాలి అని తలపోసి రోడ్డుమీదికి నడిచాడు.

తెల్లవారుతూ వుంది.

టీ తాగాడు కాకా హొటాల్లో.

'డబ్బు!'

కొండవలిగంట ప్రశ్న!

'పెళ్లి'

గుండెల్లో ఆరాటం జరిగిపోతుందే అని దిగులు. జరగాలి అని కోరిక.

తెల్లవారింది.

బస్సు స్టాండ్ కి వెళ్లాడు.

జనం వత్తిడి లేదు.

బాంక్ దగ్గరికి వెళ్లాడు.

పచ్చని కారు!

గులాబిరంగు చీరె స్త్రీ!

మెడనిండా నగలు.

కారులో కదలకుండా కూర్చుని జనంవైపు చూస్తూవుంది.

ఆఫీసరు భార్య అయివుండాలి. డబ్బు మార్చుకోవటం కోసం వచ్చి వుంటుంది.

పల్లెటూరి ఆసామి. రెండువందలు బ్యాంకిలోంచి మార్చి తీసుకున్నాడు. వెలుపలికి వచ్చాడు.

బిచ్చాలు అతన్ని అనుసరించి రోడ్డుమీదకు వెళ్లాడు. కారు డ్రైవ్ చేసుకుంటూ గులాబిరంగు చీరె స్త్రీ వెళ్లిపోయింది.

ఆసామి మార్కెట్టుకు పోయాడు. ఏమేమో కొని సంచిలో వేసుకుంటున్నాడు.

చేపల ధర.

సైకిల్ గంట.

మాంసం కేకలు.

స్నేహితుడి పలకరింపు.

జనం గోల.

'డబ్బు' గుండెల్లో గుబులు.

'పెళ్లికి' పెద్ద కొడవలి.

ఆసామి బనీనుకి జేబు. జేబులో డబ్బు పైన చొక్కా, పెద్ద బొత్ర.

పోలీసు బుట్ట కదులుతూంది.

ఆసామి నడక సాగించాడు. బిచ్చాలు వెంట వున్నాడు.

నడుస్తున్నాడు.

కారు హారన్, రిక్షా బెల్, రణగొణ ధ్వని.

బిచ్చాలు గుండెల్లో తొందర!

అమ్మాయి చూపు!

నరాల పాటలు!

'ధర్మం బాబూ!' కేక!

బిచ్చాలు ధర్మం చేశాడు.

అది దేవుణ్ని సహాయం చేయమనే కోర్కె రూపాంతరం.

దొంగ దేవుడితో మద్దత్తు

ఆకలి అవుతూంది.

ఒంటి గంట దాటింది.

'తప్పుకోవయ్యా!' రిక్షా కేక!

ఆసామి హొటల్‌లోకి వెళ్లి కాఫీ తాగుతున్నాడు.

బిచ్చాలు కూడ వెళ్లాడు.

'హల్వా, లడ్డూ'

'పెసరట్, మినపట్'

'కాఫీ, టీ' కేకలు.

'ఆరణాలు—ఇంకొక్కణా—మీారు బేడ' అని కేషియర్ మాటలు.

'కాఫీ పట్రా' ఆసామి ఆర్డర్.

'గారె! కాఫీ! తొందర' బిచ్చాలు ఆతృత.

'ప్లేటులో చేతులు కడగొద్దండీ' సర్వర్ హెచ్చరిక.

'కొంచెం సుగర్'

'కాఫీ ఏడ్చినట్లుంది'

'అట్టు కాల్లేదు'

వింత వింత సంభాషణలు.

'పెళ్లెప్పుడు చేసుకుంటావ్'

ఒక మిత్రుడు అడిగే ప్రశ్న కాఫీకోసం.

'పెళ్లి' బిచ్చాలుకి దిగులు.

'లచ్చి—డబ్బు—ఆసామి—పెళ్లి.'

బిచ్చాలు తొందర.

'జానకి ఎలా వుంది?'

'పాఠం ఎంతవరకయింది?'

'రేపు ఊరు వెళుతున్నా'

'డబ్బులు లేవు'

హొటల్లో ఎవరెవరో మాట్లాడుకొంటున్నారు.

'డబ్బు' బిచ్చాలుకి చాల కష్టంగా వుంది.

ఆసామి బిల్లు చెల్లించి నడక సాగించాడు.

బిచ్చాలు అనుసరించాడు.

ఆసామి బొర్ర సర్దుకున్నాడు, డబ్బు తడుంకున్నాడు, చేతిలో సంచి లేదు!

త్వరత్వరగా పోయి హొటల్లో విడిచిపెట్టిన సంచి తిరిగి తెచ్చుకున్నాడు.

'లచ్చి పెళ్లికి డబ్బు ఎందుకివ్వాలి?'

'ఏమో'

ప్రశ్నా, జవాబూ కదిలాయి హృదయంలో.

పోలీస్ విజిల్.

'డబ్బు ఇవ్వకపోతే ఎలా?'

'ఏమవుతుంది?'

రిక్షా బెల్.

నడక సాగుతూవుంది.

అవకాశం కలగటంలేదు.

బిచ్చాలు ఏమో ఆలోచిస్తున్నాడు.

ప్రేమించి ఏదో పుట్టుకతో పుట్టిన లోపాలు లోపాలుగా భావించి అసహ్యించుకొన్న లచ్చిని ప్రేమిస్తూ సహిస్తూ పెళ్లి కోసం డబ్బు ఇవ్వబోవటం, పెళ్లి జరగటంకోసం దొంగతనం మానమని చెప్పిన వ్యక్తి పెళ్లి జరగటంకోసం దొంగతనం చేయటం.

ఏమిటో బిచ్చాలుకి అర్థం కావటంలేదు.

పచ్చని కారు!

సిమ్మెంటు రోడ్డుమీద జారిపోతూవుంది.

కారులో మెరుపుతీగ!

గులాబిరంగు చీర స్త్రీ!

రోడ్డుమీద గులాబిపూలు.

ఎక్కడ గులాబీలు ఎక్కువగా దొరుకుతాయో ఆ మార్కెట్టులో అమ్మాయిలుకూడ అమ్మకంలో లభ్యమవుతారు.

ఎక్కడ వ్యభిచారం ముమ్మరంగా వుంటుందో అక్కడ మగసిరి తక్కువగా వుంటుంది.

రైలు స్టేషను.

టిక్కెట్లు ఇచ్చేతావు!

అక్కడ గందరగోళం జరుగుతుంది. ఆసామి దగ్గర్నుంచి డబ్బు కాజేయటానికి అవకాశం వుంటుంది.

అలాగే జరుగుతుంది.

అది మంచి అదును.

ఆసామి బొర్రమీద చేయివేశాడు, డబ్బు చేతికి తగిలింది.

పోలీసు వచ్చాడు.

ఛ్యా!

ఆశలన్నీ అణగారిపోయాయి.

టిక్కెట్టు తీసుకున్నాడు బిచ్చాలు, ప్లాటుఫారంమీదికి
చ్చాడు.

రైలు ఎక్కేటప్పుడు అవకాశం చిక్కవచ్చు.

అలా కుదరకపోతే రైలులో వీలు దొరకవచ్చు.

సిగ్నలు వంగింది.

ఆ స్టేషన్‌లో రైలు రెండు నిమిషాలే ఆగుతుంది.

జనం రద్దీగా వున్నారు.

రైలు రాలేదు.

బిచ్చాలు ప్లాటుఫారం అంతా తిరుగుతూవున్నాడు.

వెయిటింగ్ హాలులో ఆసామి కూర్చున్నాడు. బిచ్చాలు
గ్గరకుపోయాడు, మాట్లాడించాడు, ఆ మాట ధోరణినిబట్టి
నందించాడు.

రైలు వచ్చింది.

ఎక్కే జనం ఎక్కుతున్నారు, దిగే జనం దిగుతున్నారు.

గార్డు విజిల్ వినిపించింది.

ఇంజన్ కూత వేసింది.

ఆసామి ఎక్కలేదు, తొందరపడుతున్నాడు, శరీరం పెద్దది
ావటం కష్టం కలిగిస్తూవుంది.

అందరూ తొందర పడుతున్నట్లే బిచ్చాలూ తొంద పడుతున్నాడు.

జనం నెట్టుకుంటున్నారు.

గార్డు విజిల్ వూదింది, జెండా వూపాడు.

ఇంజన్ కూత వేసి, కదిలింది.

ఆసామి రైలెక్కాడు.

బిచ్చాలు ఎక్కలేకపోయాడు.

ఆసామి బన్నీను చిరిగిపోయింది.

బిచ్చాలు చేతులోకి పర్సు వచ్చింది, జేబులో పెట్టుకున్నాడు.

బీడీ ముట్టించాడు.

పొగ రింగులుగా తిరుగుతూవుంది.

ఎదురుగా గులాబిరంగు చీరె స్త్రీ! నిలబడకుండా చూచూడనట్లు వెళ్లిపోయింది.

డబ్బు లెక్కపెట్టాడు.

'నూట తొంబయి రూపాయిలు'

కావలసింది రెండువందలు.

తగ్గింది పది.

అనుకున్నంతా ఇవ్వవలసిందే! ఇంకా టైం ఉంది.

'ఇవ్వకపోతే.........' బిచ్చాలు చెంపలు వాయించుకున్నాడు. అలాంటి ఆలోచన కలిగినందుకు.

రాములు కనిపించాడు.

'నా మాట ఏం జేసా?'

'సాయంకాలం పదిగంటలకి వస్తాను'

'సరే'

బిచ్చాలు బయలుదేరాడు.

'ఇంకా పది రూపాయలు సంపాయించాలి ఎలాగైనా' నుకున్నాడు.

*　　*　　*　　*

సినిమా హాలు.

మ్యాటినీ విడిచిపెట్టే సమయం.

బిచ్చాలు హాలుదగ్గర నిలబడ్డాడు.

'పది రూపాయలు'

క్షణక్షణమూ గుర్తుకు వస్తూవుంది.

'ఎలా' అనుకున్నాడు, చుట్టూ చూశాడు, అవకాశం నిపించటం లేదు.

కాలేజి విద్యార్థి కాబోలు పది రూపాయిల కాగితాలు నిపించేట్టుగా జేబులో పెట్టుకున్నాడు.

'సరే'

మనస్సులో నిర్ణయం కదిలింది బిచ్చాలుకి. దగ్గరకు వెళ్లాడు. రాడు. ఎంత దూరంగావున్న అమ్మాయినయినా టెలిస్కోపు ళ్లతో చూస్తున్నాడు.

మ్యాటినీ విడిచిపెట్టారు.

జనం వెలుపలికి వస్తున్నారు.

ఇద్దరూ జనానికి ఎదురుగానే నిలబడ్డారు.

రద్దీ ఎక్కువయింది.

జేబు తేనె తెట్టులాగవుంది.

కుర్రాడు పరధ్యానంగా వున్నాడు.

సినిమా చూచి తిరిగివెళ్లే అమ్మాయివైపు రెప్ప వాల్చకుండా కుర్రాడు చూస్తున్నాడు. శరీరం మరచిపోయాడు.

జనం నెట్టుకుంటూ వెళుతున్నారు.

బిచ్చాలు కుర్రాడి భుజం తాకుతూ నిలబడ్డాడు.

కుర్రాడి ధ్యాస అమ్మాయివైపే వుంది.

బిచ్చాలు చేయి సాగింది. జేబు దగ్గరకుపోయింది.

ఎవరో దగ్గారు.

చేయి వణికింది.

అమ్మాయి వెళ్లిపోయింది, కనిపించటంలేదు.

కుర్రాడు చూపులు మరల్చుకున్నాడు.

జేబుదగ్గర నృత్యం చేస్తున్న చేతివ్రేళ్లు.

కుర్రాడు బిచ్చాలు ముఖంలోకి చూచి, అక్కడ అడకుండా దూరంగా వెళ్లి నిలబడ్డాడు.

గుండెలు అవిసిపోయాయి.

'దొంగ' అంటె 'దొంగ' అంటూ జీవితంలో ఏదో సందర్భంలో మరేదోవిధంగా దొంగలు కాకుండా వుండనివాళ్ళు దొంగ అయిన వాడిని కొడతారు.

అనుకున్నాడు బిచ్చాలు.

కుర్రాడు ఏమీ అనకుండా వెళ్లిపోయాడు.

'అమ్మయ్య' బిచ్చాలు రోడ్డుమీదికి వచ్చాడు.

మ్యాటినీ జనం పూర్తిగా వెళ్లిపోయారు.

మొదటి షోకి జనం మెల్ల మెల్లగా మూగుతున్నారు. కెట్లు ఇస్తున్నారు, రద్దీలేదు.

'పది రూపాయలు కావాలి'

'ఎలా?'

గుండెలు చీల్చే ప్రశ్న!

'ఉన్నంతవరకు ఇచ్చేస్తే'

'అలా వీలులేదు, పూర్తిగా ఇవ్వాలి, ఏమయినాకానీ యత్నించాలి!'

నిర్ణయించుకున్నాడు.

పచ్చకారు!

గులాబిరంగు చీరె స్త్రీ!

నవ్వుతూ దిగింది.

మెడనిండా నగలు, చేతికి వాచీ, వేళ్లకు ఉంగరాలు.

ఎర్రని రబ్బరులాంటి శరీరాని గులాబిరంగు చీరె!

ఆకుపచ్చని జాకెట్.

కళ్లలో అదోమాదిరి ఇది.

నలిగిన దొండపండువంటి పెదాలు.

కళ్ల క్రింద, పెదాలపైన ముక్కుకి ప్రక్కగా కత్తి కోతలాంటి చ్చ!

పుష్టి గలిగిన శరీరం వంపులు నిండయిన విగ్రహం.

ఎత్తయిన భుజాలు.

'ఏమిటీ?' అన్నట్లు నొసలు.

'ఈమె నెక్కడో చూచిన గుర్తు' అనుకొన్నాడు బిచ్చాలు.
'ఎక్కడా?' ఆలోచించాడు. 'ఏమో! అర్థంకాక వూరుకున్నాడు.
'మిమ్మల్ని ఎక్కడో చూచిన గుర్తు'. అంది ఆమె. దగ్గర వచ్చి బొంగరుగా మెల్లగా నవ్వుతూ.

'అదే నేనూ ఆలోచిస్తున్నాను' అనేశాడు.

ఆమె నవ్వేసింది, బాగా దగ్గరగా వచ్చి నిలబడింది.

'మీ దేవూరు?' అంది.

'ఈవూరే' అన్నాడు.

మళ్లీ మాటలు లేవు.

సినిమాకి టిక్కెట్లిస్తున్నారు.

'మీరో' అన్నాడు.

'ఈవూరే!' అంది.

నవ్వాడు.

'మా నాన్న కలెక్టరు'

ఆవులించాడు.

'మా మామ డి.యస్.పి.'

గుండెలు కదిలాయి.

'మా బావ ఎస్.ఐ.'

వణుకు పుట్టింది.

'నన్నిచ్చి పెళ్లి చేయాలని ఆలోచిస్తున్నారు.'

చెమటపట్టింది.

'నాకిష్టం లేదు.'

గుండె కొట్టుకుంటూవుంది.

'మీగురించి చెప్పరూ' అడిగింది.

'ఏం చెప్పనూ?'

'చదువుకుంటున్నారా?'

'ఆఁ! అవునవును.' లోపలలోపలే ఆమె, తెలివితక్కువకి వ్వుకున్నాడు.

'ఏం చదువుతున్నారో?'

'బి.ఏ.'

ఆమె చెబుతూవుంది.

'నాలుగురోజులు క్రిందట చూశాను' దగ్గరగా వచ్చింది. ంజానికి భుజం తగులుతూ వుంది. నరాలు పాటలు పాడు ంన్నాయి. 'ఉదయం బ్యాంక్ దగ్గర మాటాడదామను న్నాను.' కాలుకి కాలు తగులుతూ వుంది. బూట్లూ ప్పులూ మాట్లాడుకుంటున్నాయి. 'మధ్యాహ్నం హోటల్లో లుసుకోందామనుకున్నాను.' చేయి భుజంమీద వేసింది. ండె రక్తనాళాలు సాగుతున్నాయి. జనం కళ్లు బిత్తర యూయి.

'స్టేషనులో ఏమో చెప్పాలనుకొని వచ్చాను.' చెంపలు ర్రబడ్డాయి, శరీరం మత్తుగా అయిపోయింది. నిద్ర మగత ంటి తూలు కలిగింది.

'చివరికి ఇక్కడ దొరికారు.' దూరంగా వెళ్లింది. ఎవరయినా ాస్తారేమో అనుకుంది. అట్నూ ఇటూ చూచింది. కొంచెం యపడింది.

'సినిమాకి పోదామా?'

'ఆఁ ఆఁ! ఊఁ!'

ఆమె వానిటీ బేగ్ తీసి పదిరూపాయల కాగితం వెలుపలి
లాగింది.

'మీకూ నాకూ బాక్స్ తీసుకోండి.'

డబ్బు నా దగ్గరుంది'

'అలా కాదు, ఇది తీసుకోండి'

'వద్దు'

'పుచ్చుకోమంటూంటే!' చేతిలో పెట్టింది. 'టిక్కెట్లు తీసుకురండి' పంపింది.

బిచ్చాలు బుకింగ్ దగ్గరకు పోయాడు.

విపరీతంగా ఆలోచనలు.

'పది రూపాయలు'

'లచ్చి—పెళ్లి—పది రూపాయలు—రెండువందలు'

ఒక ఆలోచన.

'టిక్కెట్లు—బాక్స్—సినిమా—అందమయిన అమ్మాయి ఆనందం'

మరొక భావన.

రెంటికీ యుద్ధం.

జయాపజయాల మనుగడ రగడ.

టిక్కెట్టు దగ్గరకుపోయి తీసుకోబోతూ ఆగిపోయాడు.

రోడ్డుమీదికి వేగంగా వెళ్లిపోయాడు.

మలుపు అడ్డంగా వుంది.

రిక్షా ఎక్కాడు. 'పోనీయ్' అన్నాడు. 'లచ్చి జయించింది' అనుకున్నాడు.

రిక్షా కదిలింది. అయితే—అయితే—చటుక్కుని దిగాడు.

బుకింగ్ దగ్గరకు పోయాడు. టిక్కెట్టు తీసుకున్నాడు.

మునుపు ఆమె నిలబడిన చోటుకి వెళ్లాడు.

బీడీ ముట్టించాడు.

ఆమె లేదు!

ఎటో వెళ్లివుంటుంది, వస్తుందిలే అనుకున్నాడు.

కారు లేదు!

రోడ్డుమీదికి వెళ్లాడు.

కారు రోడ్డుమీద జారిపోతూ వుంది.

దూరమవుతూ వుంది.

చేతిలో టిక్కెట్లు గాలికి కదులుతూవున్నాయి.

అనుకోకుండా జేబు తడుముకున్నాడు.

డబ్బులేదు.

బిచ్చాలు ముఖం పాలిపోయింది.

రక్తం తాగటంకోసం వేగంగా పరుగెత్తే నల్లిలాగా కారు మలుపు తిరిగి వెళ్లిపోయింది.